



పిచ్చికుక్క వీరంగం

- ఆలూర్‌లో ఏడుగురిపై దాడి
- భయాందోళనలో గ్రామస్థులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 20: ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. పిచ్చికుక్క ఏకంగా ఏడుగురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన విశ్వాస్, మల్లక్క, సావిత్రి, రాములు, మల్లాగౌడ్, నల్లన్న, మోహన్ లపై పిచ్చికుక్క ఒక్కసారిగి దాడి చేసి గాయ పరిచింది. దీంతో బాధితులను దేగాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పిచ్చికుక్క ఒకేరోజు ఏడుగురిపై దాడి చేయడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. తమ చిన్న పిల్లలను పంపడానికి జంకుతున్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మల్లక్క, మోహన్‌తోపాటు బాలుడు విశ్వాస్



- మంజీరా వెంట సర్వే చేస్తున్న అధికారులు
- అక్రమ రవాణాపై నజర్ పెడుతున్న యంత్రాంగం
- అభివృద్ధి పనులతో పాటు ఇతర అవసరాలకు అనుమతులు మంజూరు చేయనున్న అధికారులు

జిల్లాలో ఇసుక నిల్వలపై సర్వే

నిజామాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇసుక నిల్వలను గుర్తించేందుకు అధికారులు సర్వే చేపట్టారు. జిల్లా అవసరాల కోసం ఇసుక నిల్వలను పరిశీలించి అనుమతి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మంజీరాతో పాటు వాగుల వెంట ఇసుక నిల్వలను పరిశీలిస్తున్నారు. అభివృద్ధి పథకాలతో పాటు భవన నిర్మాణాల కోసం అవసరమైన ఇసుకను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయిలో అనుమతులను జారీ చేయడంతో పాటు అక్రమ రవాణాను అరికట్టి కేసులను కూడా నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రాత్రివేళల్లో ఇసుక తరలింపుపై నిఘా పెట్టడంతో పాటు అక్రమ రవాణా చేసే వాహనాలను కూడా సీజ్ చేయడం, ఎక్కువ మొత్తంలో జరిమానా విధించేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు పడి వాగులు, మంజీరాలో ఇంకా నీళ్లు ఉండటం వల్ల ప్రస్తుతం క్వారీలకు అవసరమైన ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో లభించే ఇసుక నిల్వలనుబట్టి జిల్లాలో అభివృద్ధి పనులతో పాటు ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

జిల్లాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వర్షాల వల్ల కొంత జాప్యం జరిగినా ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో పనులను చేపడుతున్నారు. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలతో పాటు సాగునీటి శాఖకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఇవేకాకుండా ఇతర శాఖలకు చెందిన పనులు జరుగుతున్నాయి. ఆఫీస్‌లకు సంబంధించిన భవనాల నిర్మాణంతో పాటు విద్యాసంస్థలకు సంబంధించిన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇవేకాకుండా భవన నిర్మాణాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. వీటన్నింటికీ ఇసుక ఎక్కువగా అవసరం అవుతుంది. ప్రభుత్వం పనులకు ఇసుకను అనుమతిస్తుండగా ప్రైవేటు నిర్మాణాలకు మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని మండలాల పరిధిలో ఇసుక రీచ్‌లు ఉండటం వల్ల ప్రభుత్వ పనులతో పాటు ప్రైవేటు పనులకు కూడా తహసీల్దార్ స్థాయిలో పరిమిత అనుమతులను ఇస్తున్నారు. ఇవే కాకుండా ఇతర పనుల కోసం అనుమతులను ఇస్తున్నారు. జిల్లాలో భారీ ఎత్తున నిర్మాణాలు చేసే భవన నిర్మాణం కాంట్రాక్టర్లు ఇసుకను గోదావరి పరివాహక ప్రాంతం కాళేశ్వరం చెన్నూరు నుంచి తీసుకువస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా తీసుకువచ్చి పనులకు వినియోగిస్తున్నారు. జిల్లాలో మంజీరాతో పాటు పెద్దవాగు, కప్పలవాగు, పూలాంగ్ వాగుతో పాటు ఇతర వాగుల్లో ఇసుక నిల్వలు ఉన్నాయి. చిన్న చిన్న వాగుల్లో తక్కువ మొత్తంలో నిలువలు ఉండగా మంజీరా వెంట ఎక్కువగా ఇసుక నిల్వలు ఉన్నాయి. ఈ నదితో పాటు పెద్దవాగులో కూడా ఎక్కువ మొత్తంలో ఇసుక నిల్వలు ఉన్నాయి. జిల్లా అవసరాలకు కూడా వీటి వెంటనే అనుమతులను మంజూరు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఇసుక నిల్వలను ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇసుకకు డిమాండ్ పెరగనుండటంతో ప్రస్తుతం మంజీరా వెంట గనులు, భూగర్భ శాఖల అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారు. మంజీరా వెంట మందర్న, సుంకిని, పోతంగల్, కారేగాంతో పాటు ఇతర ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. ఇసుక నిల్వలను అంచనా వేస్తున్నారు. నీటి నిల్వ ఎక్కువగా ఉండటం వల్ల సర్వేను నిర్వహిస్తున్నారు. మంజీరా వెంట పదిచోట్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు ప్రస్తుతం అంచనా వేశారు. జిల్లా అవసరాలకు ఈ నిల్వలు సరిపోతాయని భావించడంతో పాటు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. సంవత్సరం పాటు వినియోగించుకునే విధంగా ఆయా శాఖల ద్వారా ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో నిర్మాణాలకు ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావడం ఇబ్బందులు అవుతుండటంతో అధికారులు ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. పూర్తి సర్వే తర్వాత ఇసుక నిల్వల ఆధారంగా జిల్లా అవసరాలకు అనుమతులను మంజూరు చేయనున్నారు.



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

జిల్లాలో గడిచిన కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. జిల్లాలో మంజీరాతో పాటు వాగుల వెంట రాత్రి వేళల్లో తవ్వకాలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. రాత్రి వేళల్లో తవ్వకాలు చేసి పలు ప్రాంతాల్లో డంప్‌లలో నిల్వలను ఉంచుతున్నారు. పగటివేళల్లో అక్కడి నుంచి అవసరమైన వారికి తరలింపు చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అధికారులు పట్టుకుంటూనే ఇవి ఆగడం లేదు. కొన్ని చోట్ల వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు ఎక్కువగా విధించిన తర్వాత యథావిధిగా కొనసాగిస్తున్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్కువ మొత్తంలో రీచ్‌లను గుర్తించి అవసరమైన వారికి అనుమతులు ఇచ్చేందుకు ఈ సర్వేలను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా అధికారులు తీసుకునే నిర్ణయం ఆధారంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు రానున్నాయి. అధిక సంఖ్యలో అవసరం ఉన్న వారికి అనుమతులు ఇస్తే అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం ఉంది.

రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రం అందజేసిన ఎంపీ అర్వింద్

- జిల్లాకు సంబంధించిన హామీలను నెరవేర్చాలని వినతి

పెద్దబజార్, సెప్టెంబరు 20: కొత్త ఆర్‌వోబీలను మంజూరు చేయాలని, కొత్త రైళ్లను నిజామాబాద్ మీదుగా మళ్లించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను శుక్రవారం ఢిల్లీలో ఎంపీ అర్వింద్ కలిశారు. జిల్లాకు సంబంధించిన హామీలను నెరవేర్చాలని కోరారు. కాజీపేట, దాదర్ రైలును త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం త్వరగా చేసే విధంగా అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని రైల్వే మంత్రిని కోరారు. ఢిల్లీకి నిజామాబాద్ మీదుగా రైలును నడపాలని కోరారు. తిరుపతి, ముంబాయి కొత్త రైలును వేయాలని కోరారు. ఆర్మూర్, ఆదిలాబాద్, బోధన్, బీదర్ రైల్వేలైన్‌లను మంజూరు చేయాలని కోరారు. తాను తీసుకువెళ్లిన సమస్యలన్నింటినీ సానుకూలంగా పరిశీలించడంతో పాటు నెరవేరుస్తానని హామీ ఇచ్చినట్లు అర్వింద్ తెలిపారు.

సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన

సిబ్బందికి మెమోలు జారీ చేయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఇందల్వాయి, సెప్టెంబరు 20: ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందికి మెమోలు జారీ చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు డీఎంహెచ్‌వో రాజశ్రీని ఆదేశించారు. శుక్రవారం ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ విభాగాలను పరిశీలించారు. రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ పలు లోపాలను గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. ఔషధాలు నిల్వచేసే ఫ్రిజ్‌లు నిరుపయోగంగా ఉండటంపై ప్రశ్నించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అధికారులచే సమన్వయంతో ఉంటూ పనులు చేయించుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న రోగులకు ఖచ్చితంగా రక్త పరీక్షలు చేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య శాఖ ఆరోగ్య అధికారిణి డాక్టర్ రాజశ్రీ ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించి ప్రతీ ఒక్క డెంగీ కేసును ఆరోగ్య కార్యకర్తచే సర్వే చేయించాలని, ఒక్కో కార్యకర్త 50ఇళ్లలో సర్వే చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో మందుల నిల్వగల ప్రాంతాన్ని, రక్త పరీక్ష కేంద్రాన్ని, ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించారు. ప్రతీ సోమ, మంగళ వారం అమ్మ ఒడి కార్యక్రమంలో గర్భిణులకు వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్యాధికారి సంతోష్‌కు సూచించారు. ఈ నెలలో వచ్చిన డెంగీ కేసుల వివరాలు అసంక్రమిత వ్యాధులైన హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వ్యాధిగ్రస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి నెలకు సరిపడా మందులు అందజేయాలని సూచించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా ప్రతీ బుధవారం, శనివారం శిశువులకు అందజేసే టీకా కార్యక్రమం, వాటి టీకాలు నిల్వ చేసే ఐఎల్‌ఆర్‌లను పరిశీలించారు. వీరి వెంట సీసీ నాగరాజు, స్థానిక వైద్యాధికారి సంతోష్, మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్, సిబ్బంది ఉన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



- దరఖాస్తులు రాక గడువు పెంచిన విద్యాశాఖ
- ప్రైవేటు విద్యాసంస్థల నుంచి కానరాని స్పందన
- ఇప్పటి వరకు కేవలం 1000 నామినేషన్లు
- జిల్లా వ్యాప్తంగా 775కు పైగా ఉన్నత పాఠశాలలు



ఇన్‌స్పైర్ ప్రదర్శనలో విద్యార్థి (ఫైల్)

'ఇన్‌స్పైర్'కు ఆదరణ అంతంతే!

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 20: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కొత్త ఆవిష్కరణలను రూపొందించేందుకు నిర్వహిస్తున్న ప్రేరణ (ఇన్‌స్పైర్) కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటుండగా, ప్రైవేటు పాఠశాలల నుంచి మాత్రం స్పందన కనిపించడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రేరణ మనక్ అవార్డుల కింద పాఠశాలల విద్యార్థుల నుంచి ఆవిష్కరణలకు నామినేషన్‌లను స్వీకరిస్తున్నారు. ఇప్పటికే గడువు ముగిసిపోగా పాఠశాలల నుంచి నామినేషన్‌లు ఆశించిన మేరకు రాకపోవడంతో నామినేషన్ల గడువును వచ్చేనెల 15 వరకు పొడగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ఐదు ఆవిష్కరణలకు ఖచ్చితంగా నామినేషన్‌లు దాఖలు చేయాల్సి ఉండగా జిల్లాలో ఆశించిన మేర నామినేషన్‌లు దాఖలు కాలేదు.

1000 నామినేషన్లు మాత్రమే

జిల్లాలో 275కు పైగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 500లకు పైగా ప్రైవేటు ఉన్నత పాఠశాలలు ఉండగా ఇప్పటి వరకు 1000నామినేషన్లు మాత్రమే వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 775కు పైగా ఉన్నత పాఠశాలలు ఉండగా 3వేల వరకు నామినేషన్‌లు దాఖలు కావాల్సి ఉంది.

వచ్చేనెల 15 వరకు గడువు

జిల్లాలో ప్రేరణ అవార్డుల కోసం నామినేషన్‌లు సమర్పించేందుకు 775కు పైగా ఉన్నత పాఠశాలలు ఉండగా ఒక్కో పాఠశాల నుంచి ఐదు నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి కనీసం ఐదు ఆవిష్కరణల నామినేషన్లు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధన పెట్టారు. దీని ప్రకారం జిల్లా వ్యాప్తంగా 3వేలకు పైగా రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలి. కానీ ఈ విద్యాసంవత్సరం జూలై 1వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటికీ వెయ్యి నామినేషన్లు మాత్రమే వచ్చాయి. ఈనెల 15తోనే నామినేషన్ల గడువు ముగిసింది. కానీ లక్ష్యంలో కనీసం 30 శాతం ప్రతిపాదనలు కూడా దాటకపోవడంతో వచ్చేనెల 15 వరకు గడువు పెంచారు.

ఆసక్తి చూపని ప్రైవేటు పాఠశాలలు

ప్రతీ సంవత్సరం కొన్ని పాఠశాలలు, విద్యార్థులు మాత్రమే ఈ ఆవిష్కరణలపై దృష్టి పెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు ముందు నుంచి ప్రోత్సహిస్తూ ఈ ప్రేరణలో పాల్గొనేలా చూస్తున్నారు. ప్రైవేటులోను కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ప్రచారం పొందవచ్చనే ఉద్దేశ్యంతో పాల్గొంటున్నారు. కానీ కొన్ని ప్రైవేటు పాఠశాలలు మాత్రం ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కొందరు ఉపాధ్యాయులు విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఇన్‌స్పైర్ కార్యక్రమంపై ఆసక్తిని చూపిస్తుండగా కొందరు మాత్రం ఆసక్తిని చూపడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని తరగతులలో విద్యార్థులు తక్కువగా ఉండటంతో పాటు విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో పాల్గొనలేకపోతున్నారు. అలాగే ప్రతీ పాఠశాల నుంచి ఖచ్చితంగా నామినేషన్లు దాఖలు కావాలనే నిబంధన ఉన్నప్పటికీ కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించి అనాసక్తి చూపుతున్న పాఠశాలలపై దృష్టిపెట్టి వారి నుంచి నామినేషన్లు వచ్చేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- పోలీసు కమిషనర్ కల్మేశ్వర్

ఖిల్లా, సెప్టెంబరు 20: నూతన న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, బ్రిటిష్ కాలంలో రాసిన చట్టాల్లో అనవసరంగా భావించిన వాటి స్థానంలో ప్రజలకు సత్వర న్యాయం కలిగే విధంగా నూతన చట్టాల రూపకల్పన చేయడం జరిగిందని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ అన్నారు. నగర శివారులోని బోర్గాం గ్రామ సమీపంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మీడియా ప్రతినిధులకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. జూలై 1వ తేదీ నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయ చట్టాలు అమలులోకి వచ్చిన తరుణంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటిస్తున్న నూతన విధానాల మీద మీడియా మిత్రులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. నిరంతరం వార్తలు రాసే మీడియా మిత్రులకు ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. ప్రజలు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోరాదని సమస్య పరిష్కారానికి పోలీసులను ఆశ్రయించాలన్నారు. అదే విధంగా గ్రామాభివృద్ధి కమిటీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సమంజసం కాదన్నారు. గతంలో గ్రామ స్థాయి సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామ కమిటీలు ఉండేవన్నారు. అవే కమిటీలు ప్రస్తుతం గ్రామాభివృద్ధి కమిటీలుగా ఏర్పడి సమస్యలను న్యాయస్థానాలకు వెళ్లకుండా చూస్తున్నాయన్నారు. నూతన చట్టాలను అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావ్, నిజామాబాద్ ఏసీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సందేహాలను వివరించారు. ఈ అవగాహన సదస్సులో అదనపు డీసీపీ(ఏఆర్)శంకర్‌నాయక్, ఏసీపీలు బస్వారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావ్, నాగయ్య, నారాయణ, రవీందర్‌రెడ్డి, వివిధ విభాగాల స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్ సింగనేవార్



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు20: రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. బాలికల విభాగంలో శ్రీవర్షిణి, బాలుర విభాగంలో శేఖర్, సుశాంత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో శనివారం నుంచి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన

భీమ్‌గల్, సెప్టెంబరు 20: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 3వార్డు ప్రజలకు తడి చెత్త, పొడిచెత్తపై అవగాహన నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పట్టణంలో దుకాణదారులందరు ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని కమిషనర్ రామకృష్ణ తెలిపారు. మాంసం వ్యాపారులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ కవర్లు వడవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్, వైస్‌చైర్మన్ జగత్, కౌన్సిలర్, మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఆర్ఐ రాజేశ్వర్, నవీన్ కుమార్, మాణిక్యం, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఓంప్రకాష్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్ కూరగాయల మార్కెట్‌లో..

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజుల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మార్కెట్‌లోని చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, జవాన్ గోపి, సిబ్బంది అక్షయ్, రాము, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో ఒప్పందం చేసుకున్న తర్వాతే విత్తనాలు సరఫరా చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు20: ఎర్రజొన్న విత్తనాలను రైతులకు అందజేసే వ్యాపారులు రైతులతో విత్తన ఒప్పందం చేసుకున్న తర్వాతనే విత్తనాలను సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని రైతు వేదికలో ఆర్మూర్, భీమ్‌గల్, నిజామాబాద్‌రూరల్ డివిజన్‌ల పరిధిలోని విత్తన డీలర్లు, రైతులు అధికారులకు ఎర్రజొన్న పంట సాగు, విధివిధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజిద్‌హుస్సేన్ మాట్లాడుతూ.. బై బ్యాక్ ఒప్పందం ప్రకారం రైతులకు విత్తనాలు విక్రయించాల్సిందిగా విత్తన డీలర్‌లకు సూచించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి, ఏడీఏలు విజయలక్ష్మి, శ్రీనివాస్, ప్రదీప్, ఏవో హరికృష్ణ, విత్తన డీలర్‌లు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలు చేపట్టాలి

● రెవెన్యూ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన 'ట్రేసా'


నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 20: ఎన్నికల నిబంధనల ప్రకారం అసెంబ్లీ/పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బదిలీ చేయబడిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ వివిధ జిల్లాల నుంచి సుమారు 150 మంది తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ట్రేసా కార్యాలయానికి చేరుకొని రాష్ట్ర నాయకత్వంపై బదిలీలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తిరుగు బదిలీలు లేక కుటుంబాలకు దూరంగా ఉండి విధులు నిర్వహిస్తున్నామని చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు ట్రేసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్‌లను కలిసి విన్నవించారు. అనంతరం ట్రేసా ప్రతినిధులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దగ్గరికి తహసీల్దార్లను తీసుకెళ్లి మాట్లాడారు. వివిధ కేడర్‌లలో బదిలీలైన తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్‌లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్‌ల బదిలీలపై సానుకూలంగా స్పందించి త్వరలో బదిలీలు చేపడుతామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో నిజామాబాద్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, సతీష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు బహుమతుల ప్రదానం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు20: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ గణేష్ మండపాలకు బహుమతులను ప్రదానం చేశారు. ఉత్తమ పర్యావరణ గణపతిగా శివశక్తి యూత్ మట్టి గణపతి, కాన్సెప్ట్‌గా కాత్యాయని యూత్, మహాదేవ యూత్, ఉత్తమ అలంకరణగా విజయ్‌యూత్, కమ్యూనిటీ గణపతిగా యువ యూత్‌లను ఎంపిక చేసి అధ్యక్షులకు బహుమతులు మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, కోశాధికారి నారాయణగౌడ్, సభ్యులు అంబల్ల తిరుపతి, లోచరం చంద్రశేఖర్, గుర్రం విజయానంద్, శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

















తాళ్లరాంపూర్ సొసైటీ మహాజన సభ



మాట్లాడుతున్న చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి

ఏర్గట్ల, సెప్టెంబరు 20: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం 65వ మహాజన సభ సంఘం చైర్మన్ పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అందులో భాగంగా సంఘానికి సంబంధించిన ఆదాయ వ్యవహారాలను చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు నాఫెడ్ ద్వారా అగ్రిమెంట్ చేసుకొని ఇ-సంవృద్ధి పోర్టల్‌లో నమోదు చేసుకోవడానికి, అలాగే వరికొనుగోలు కోసం టీఎస్‌సీఎస్‌సీ ద్వారా ఏర్పాటు చేసుకోవడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొట్టాల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు దేశబోయిన చిన్న సంజీవ్, గోపిడి రాజా రెడ్డి, బద్దం రవీందర్, సీఈవో గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగశాల భవనానికి భూమిపూజ

భీమ్‌గల్, సెప్టెంబరు20: పట్టణ కేంద్రంలోని బోయిగల్లీలో బాలికల ఉన్నత పాఠశాలలో ప్రయోగాశాల (ల్యాబ్) భవనానికి శుక్రవారం ఎంఈవో స్వామి భూమిపూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం ద్వారా మంజూరైన రూ.13లక్షల 50వేలతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు లింబాద్రి, శజవ, రాములు, కాంగ్రెస్‌నాయకులు తోట సతీష్ ఉన్నారు.

'గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండ'

మోర్తాడ్, సెప్టెంబరు20: గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం కోసం గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ మృతిచెందిన కార్మికులకుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ డాక్టర్ షేక్ చాంద్‌పాషా హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మోర్తాడ్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రెండు దశబ్దాలుగా గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై ఇమ్మిగేషన్ చట్టంపై గల్ఫ్‌కార్మికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై నివేదిక రూపొందించి గత ప్రభుత్వాలకు అందజేసిన పట్టించుకోవడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సమస్యలను గుర్తించిందని అన్నారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటుతో పాటు గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికులకు రూ.5లక్షలు అందజేయాలని నిర్ణయించడం రెండు దశబ్దాల తన కృషి ఫలితం దక్కిందని చాంద్‌పాషా అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి తన హామీని నిలబెట్టుకున్నారని చాంద్‌పాషా సంతోషం వ్యక్తం చేశారు.

వేల్పూర్‌లో పీఆర్‌టీయూ నాయకులకు సన్మానం

వేల్పూర్, సెప్టెంబరు 20: వేల్పూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బోడ దేవనందం, సీవీ.నర్సింహరావులను వేల్పూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్కూల్‌కాంప్లెక్స్‌లో మండల పరిధిలోని సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దేవనందం, నర్సింహారావులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు అన్ని వేళల అండగా ఉంటామని వారన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు విజయరాజ్, శ్రీనివాస్, రాంచందర్, వినోద్, గణేష్, దేవనందం, సరస్వతి, నరేందర్, సదాశివ, ప్రసాద్, జ్యోతి, గంగదశ, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు20: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో భవిష్యత్‌లో ఇంజనీర్‌లకు అవసరమైన కీలక నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులు సురేందర్, డాక్టర్ రవిచంద్ర, దార్ల దీపక్‌లు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంజనీర్‌లకు అవసరమైన కీలక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. డిజిటల్ నైపుణ్యాలు, సమస్య, సృజనాత్మకత, టీంవర్క్, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు.

నూతన తహసీల్దార్, ఎస్‌ఐలను కలిసిన నాయకులు

రుద్రూరు, సెప్టెంబరు 20: రుద్రూరు మండల కేంద్రానికి నూతనంగా నియమితులైన తహసీల్దార్ తారాబాయి, ఎస్‌ఐ సాయన్నలను శుక్రవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఇంచార్జి మధు, మండల నాయకులు మేరాజ్, సాయికిరణ్, నీరడి సాయిలు, హరీష్, మతిన్, సాయాగౌడ్‌లు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరూ వైద్యపరీక్షలు చేయించుకోవాలి

పెర్కిట్, సెప్టెంబరు20: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా ప్రతీఒక్కరు వైద్యపరీక్షలు చేయించు కోవాలని డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీఒక్క ఉద్యోగి వారి జీవిత భాగస్వాములకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని తద్వారా ఏవిధమైన ఆరోగ్య సమస్యలు ఉన్నా తెలుసుకోవచ్చని ఆమె అన్నారు. కార్యక్రమంలో రవికుమార్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షరు, మెకానికల్ ఫోర్‌మెన్ గంగకిషన్, మరియు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

'కేటీఆర్, కేసీఆర్ మెప్పు కోసమే విమర్శలు'

డిచ్‌పల్లి, సెప్టెంబరు 20: రానున్న రోజుల్లో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, బీఆర్‌ఎస్ నిజామాబాద్‌రూరల్ నియోజకవర్గంలో నామరూపాలు లేకుండా పోతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన పదేళ్ళ కాలంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తే ఉలుకేందుకన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఉనికి కోల్పోయిందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు ఎంతో భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమ్‌శ్యాన్, వాసుబాబు, గంగాగౌడ్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, జగదీష్, దత్తాద్రి, బాబా, దేవకరుణ పాల్గొన్నారు.

ఎండు తెగులు నివారణపై రైతులకు అధికారుల సూచనలు



కమలాపూర్‌లో వరిపంటను పరిశీలిస్తున్న ఏవో నవీన్‌కుమార్

మోర్తాడ్, సెప్టెంబరు20: మండలంలోని శెట్‌పల్లిలో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సెన్ శుక్రవారం వరిపంటను పరిశీలించారు. వరి పంటకు బ్యాక్టీరియా ఆకు, ఎండాకు తెగులు గుర్తించి రైతులకు వివరించారు. రైతులు వరి పంటకు ఎండా తెగులు రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.

నవీపేట: మండలంలోని కమలాపూర్‌లో వరిపంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి నవీన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. గ్రామ శివారులో పలు రైతులకు చెందిన వరిపంటకు బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు సోకడంతో సంబంధిత పంటలను ఆయన పరిశీలించి రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు.

కోటగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించిందని నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో సందీప్ సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ, యాద్గార్‌పూర్ గ్రామాలలో శుక్రవారం వరిపంట పొలాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతులు అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో తెగులు సోకిన వరి పంట పొలాలను శుక్రవారం వ్యవసాయా విస్తీర్ణాధికారిణి రచన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలో చీడపీడల సమస్య ఎక్కువగా ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎడపల్లి: మండలంలోని పోచారం గ్రామంలో ఎండాకు తెగులు సోకిన వరిపంటను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తెగులు అధికం కాకుండా రైతులకు తగు సూచనలు చేశారు.

బోధన్‌రూరల్: రైతులకు నాణ్యమైన మందులను మాత్రమే విక్రయించాలని, పంటలకు పట్టిన పురుగులకు సంబంధించిన మందులను మాత్రమే రైతులకు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఏ అలీం అన్నారు. బోధన్ పట్టణంలోని రైతు వేదికలో శుక్రవారం బోధన్, రెంజల్, ఎడపల్లి, నవీపేట్ మండలాల పురుగుల మందుల షాప్ డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు.

కమ్మర్‌పల్లి: వరిపైరుపై ఉడిదోమ ఆశించి ఉందని నివారణా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల వ్యవసాయ విస్తీరణ అధికారులు, రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బషీరాబాద్, చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి, కోనాసముందర్, నర్సాపూర్ గ్రామాలలో అధికారుల బృదం పర్యటించి వరిపైరును సూడిదోమ ఆశించినటుల గుర్తించారు.

రెండోరోజూ కొనసాగిన మండల స్థాయి క్రీడలు

నవీపేట, సెప్టెంబరు 20 : మండలంలోని బినోలలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు రెండవ రోజైన శుక్రవారం కొనసాగాయి. 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ నవీపేట మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను గురువారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించిన విషయం విదితమే. విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీలలో భాగంగా చివరి రోజైన శనివారం ఫైనల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 20 : ప్రస్తుత పరిస్థితులలో ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అప్పుడే రోగాలు దరిచేరవని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పలుఇండ్లను సందర్శించి నిలుఉన్ననీటవల్ల నష్టాలను వివరించారు. ముఖ్యంగా ఇండ్లలో నీటి నిలువలు ఉంచరాదని దీనివల్ల లార్వ తయారై దోమలుగా మారుతాయన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలి

● జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు20: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం మిర్దాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్మూర్ మండల అంతర్ పాఠశాల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటే అవకాశం ఉంటుందన్నారు. చదువుల్లో, క్రీడల్లో జిల్లాను తెలంగాణలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. ఇటీవల జరిగిన ఓలంపిక్స్‌లో చిన్న చిన్న దేశాలు అనేక పథకాలు సాధించాయన్నారు. క్రీడల్లో లక్ష్యాలతో ముందుకు సాగితే ఆ స్థాయికి చేరుకుంటారన్నారు. మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కిషన్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీసభ్యులు సాయారెడ్డి, భానుప్రకాష్, మధువర్మ, భూమన్న, మహేంధర్, రాములు, శ్రీకాంత్; మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన విద్యా బోధన చేయాలి

రుద్రూరు, సెప్టెంబరు 20 : విద్యార్థినులకు మెరుగైన విద్యాబోధన చేయాలని రుద్రూరు మండల తహసీల్దార్ బి.తారాబాయి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రూరు మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల బోధనను, విద్యార్థులకు అందించే భోజనాన్ని ఆమె పరిశీలించారు. అదే విధంగా పాఠశాల ఆవరణ పరిస్థితులను ప్రత్యేక అధికారి శ్యామలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న కిచెన్, విద్యార్థులకు భోజనం చేసే పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్‌ఐ నజీర్, జూనియర్ అసిస్టెంట్ కొర్వ భూషణ్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

● న్యాయాధికారి వేముల దీప్తి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి వేముల దీప్తి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 20 : రాజీ మార్గమే రాజా మార్గమని న్యాయాధికారి వేముల దీప్తి సూచించారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు కోర్టుల చుట్టు తిరగకుండా సమయాన్ని వృథా చేసుకోవద్దని అన్నారు. ఇరుపక్షాలు కేసులు రాజీ చేసుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగపర్చుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి, సీఐలు రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఎస్సైలు, కోర్టు సిబ్బంది, కమ్యూనిటీ మిడియేషన్ సెంటర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు లేవని ఆందోళన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

డొంకేశ్వర్, సెప్టెంబరు20: డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను ఇంటికి తీసుకువెళ్తామని, టీసీ లు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో 400 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు రెండు, మూడురోజులకు ఒకసారి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని మండిపడ్డారు. విద్యార్థులు స్నానాలు చేసిన నీళ్ల వెళ్లడానికి డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక ఇక్కడే నీరు నిలిచి దోమలు, ఈగలు వృద్ధి చెందిన పిల్లలు అనారోగ్యం భారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు సరిపడా క్లాసు రూములు లేక పడుకోవానికి కూడా రూములు సరి˘ఎడక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కనీస వసతులు లేక పాఠశాలలో పిల్లలను చదివించమని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకు వచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్ విద్యార్థులు తల్లిదండ్రులకు సముదాయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల రోజుల్లో పాఠశాలను నూత్‌పల్లి నుంచి ఆర్మూర్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వెనుదిగారు. దసరా సెవుల్లో విద్యార్థులను ఇంటికి తీసుకువెళ్ళు మళ్ళీ పాఠశాలకు పంపించమని కొత్త భవనంలో ఏర్పాటు చేస్తేనే మా పిల్లలను పంపుతామని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు తెలిపారు.

ఫత్తేనగర్‌లో దొంగలను చితకబాదిన స్థానికులు

నవీపేట,సెప్టెంబరు 20: మండలంలోని ఫత్తేనగర్‌లో గురువారం రాత్రి ఇద్దరు కెబుల్ వైర్లు, ఫ్యూజ్‌ల దొంగలను పట్టుకుని స్థానికులు చితకబాదారు. సమీప గ్రామాలలో బోరు బావుల వద్ద ఉన్న కెబుల్ వైర్లతో పాటు బోర్డులలో ఉన్న ఫ్యూజ్‌లను తీసుకుని వెళ్తుండగా ఇద్దరు దొంగలను ఫత్తేనగర్ గ్రామస్థులు పట్టుకున్నారు. వారి వద్ద కెబుల్ వైర్లు, ఫ్యూజ్‌లు కనిపించడంతో వారిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా మండలంలోని మట్టయ్య ఫారంకు చెందిన పలువురు రైతుల భూములు నాగేపూర్ శివారులో ఉన్నాయని సంబంధిత భూములలో ఉన్న పలు బోరు బావుల వద్ద నుండి గుర్తు తెలియని దొంగలు కెబుల్ వైర్లు కోసుకుని వెళ్లారని బాధిత రైతులు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వినయ్ తెలిపారు.

చోరీ అయిన వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 20: బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున టవేరా వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. వెంటనే సదరు యాజమాని గులాం సయ్యద్ పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే పట్టణ సీఐ వెంకట నారాయణ తన బృందంతో సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో పరిశీలించారు. దొంగలింపబడిన వాహనాన్ని మల్లారం అటవీ ప్రాంతం వైపు తీసుకెళ్లినట్లు గుర్తించి అటు వైపుగా పోలీసులతో వెంబడించారు. పోలీసులు వెంబడిస్తున్న విషయాన్ని గమనించిన దొంగ వాహనాన్ని అటవీ ప్రాంతంలో వదిలేసి వెళ్లిపోయాడు. పోలీసులు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారించి వాహనాన్ని పట్టుకున్నామని త్వరలోనే దొంగను సైతం పట్టుకుంటామన్నారు. దొంగలింపబడ్డ వాహనాన్ని త్వరగా పట్టుకోవడానికి కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

పోషకాహార మహోత్సవం

మోస్రా, సెప్టెంబరు 20 : మండలంలోని చింతకుంటలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో పోషక ఆహారాల విషయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వినోద మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఉంటూ ఆకుకూరలు, ఉడకబెట్టిన గుడ్లు తినాలని విటమిన్, కాల్షియం ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటూ పుట్టిన బిడ్డకు స్వచ్ఛమైన పాలు ఇవ్వగలుగుతారని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, అంగన్‌వాడీ పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సీడీపీవో జానకమ్మ ఆధ్వర్యంలో పోషక ఆహారాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో జానకమ్మ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఉంటూ ఆకుకూరలు, విటమిన్, కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, ఉడకబెట్టిన గుడ్లు తినాలని, అవి తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటూ పుట్టిన బిడ్డకు స్వచ్ఛమైన పాలు ఇవ్వగలుగుతారని సూచించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఆమెతోపాటు సూపర్‌వైజర్ విజయరాణి, మండల వైద్యాధికారి సహిస్తా ఫిర్దౌస్, అంగన్ వాడీ టీచర్లు రిటికా, సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, అంగన్‌వాడీ పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి

కోటగిరి,సెప్టెంబరు 20: రైతులు పంట పొలాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ ఎండీ.ముక్త్యార్ సూచించారు. శుక్రవారం కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎత్తొండ గ్రామ శివారులో పంట పొలాల్లో నాలుగు విద్యుత్ స్తంభాలు వంగిపోయి తీగలు కిందకు వేలాడుతుండడంతో వాటిని సరిచేశారు. రైతులు వ్యవసాయ పంపుసెట్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ రవికుమార్, ఏఈ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

కోటగిరి,సెప్టెంబరు 20 : గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకదృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి ఎంఏ.అలీం అహ్మద్ సూచించారు. కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్‌లో శుక్రవారం ప్రత్యేక అధికారి పర్యటించారు. గ్రామంలోని పలువార్డులలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరగడంతో తొలగించాలని సూచించారు. స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు సన్మానం

కోటగిరి,సెప్టెంబరు 20: కోటగిరి ఎంపీడీవోగా పని చేసిన మనోహర్ రెడ్డి ఇటీవల సిరికొండ మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీడీవో మనోహర్ రెడ్డితో పాటు బదిలీ అయిన ఉపాధిహామీ కంప్యూటర్ ఆపరేటర్ శంకర్‌తో పాటు పలువురిని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఏడాదిన్నర పాటు కోటగిరి మండల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సహకారంతో తనవంతు కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

కోటగిరి,సెప్టెంబరు 20: పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం మహిళలకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను మండల ప్రత్యేక అధికారి అలీం అహ్మద్ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు. సబ్సిడీ రాని మహిళలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాపాలన దరఖాస్తులో వివరాలు సరి చేసి ప్రతి ఒక్కరికి సబ్సిడీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, నాయకులు వీరేశం, రాజు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ఎడపల్లి, సెప్టెంబర్ 20: మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని ఎడపల్లి శివారులో ఉన్న దేరడి నారాయణ వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌పార్మర్‌ను గురువారం రాత్రి కొందరు దుండగులు ధ్వంసం చేసి, అందులోని కాపర్‌వైరును ఎత్తుకెళ్ళారు. మండలంలో ఇలాంటి సంఘటనలు ఇప్పటి వరకు పదుల సంఖ్యలో జరిగినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో దుండగులు ఎవరు ఏం చేస్తారన్న ధైర్యంతో విచ్చల విడిగా ట్రాన్స్‌పార్మర్లను ధ్వంసం చేస్తున్నారని, వరి పంటలు పొట్ట దశలో ఉన్నాయని, వరి పంటకు ఇప్పుడు నీటి అవసరం అధికంగా ఉంటుందని ఇలాంటి సమయంలో విద్యుత్ నియంత్రికలను ధ్వంసం చేయడం వల్ల రైతులు అధికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలని వినతి

ఎడపల్లి, సెప్టెంబర్20: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో ఎడపల్లి ఉప తహసీల్దార్ అనూషకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు లక్షల రైతు రుణమాఫీ అందరికీ రాలేదని, రైతులందరికి మాఫీ చేయాలని, రైతు భరోసా ఎకరానికి 15 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమచేయాలని, పెన్షన్ 4016 వెంటనే ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు, ఖాళీ స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షలు, రైతులకు క్వింటాలుకు 500 బోనస్, వర్షాలకు ఇండ్లు కూలిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో పార్వతి రాజేశ్వర్, షేక్ నసీర్, రవి, లక్ష్మన్, మల్లేష్, పోశెట్టి, ఎర్రన్న తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

బోధన్‌రూరల్,సెప్టెంబరు 20: బోధన్ పట్టణంలోని బీటీ నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు ఆరు సంచుల పీడీఎస్ బియ్యంతో పాటు మంచినూనె ప్యాకెట్లు చోరీ చేశారని సంబంధిత అంగన్‌వాడీ టీచర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో అంగన్‌వాడీ కేంద్రంలో బియ్యం నానుతుండడంతో పక్కనే ఓ రూమ్‌లో భద్రపర్చినట్లు ఆమె తెలిపారు. శుక్రవారం కోడిగుడ్ల స్టాక్ రావడంతో బియ్యం ఉన్న రూమ్‌ను తెరవగా అందులోని ఆరు సంచుల బియ్యంతో పాటు ఒక యూనిట్ మంచినూనె ప్యాకెట్లు చోరీకి గురయ్యాయన్నారు. దీనిపై బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి సందర్శించారన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారన్నారు.

'న్యాక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 20: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య అన్నారు. శుక్రవారం బోధన్, సాలూర మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు బోధన్ డిప్యూటీ డీఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్‌పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని, మాదిరి పాఠ్య బోధన నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు నిరంతరం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఆరిఫొద్దీన్, రిసోర్స్‌పర్సన్ రాకేష్, హన్మాండ్లు, సీఆర్‌పీలు విజయ్ బాబు, షఫీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నసురుల్లాబాద్ గండి ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 20: నసురుల్లాబాద్ మండల కేంద్ర పరిధిలోని గండి ప్రాంతంలో శుక్రవారం నసురుల్లాబాద్ ఏఎస్సై అబీద్ బేగ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఏఎస్సై అబీద్ బేగ్ మాట్లాడుతూ ధ్రువపత్రాలు లేని వాహనాల యజమానులకు ఆన్‌లైన్ జరిమానాలు వేయడం జరిగిందన్నారు. వాహనదారులు రహదారిపై వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనదారులు, హెల్మెట్, లైసెన్స్ వెహికల్ ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని అలాగే కార్ డ్రైవింగ్ చేసే వారు బెల్ట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. ఈ తనిఖీలలో ఏఎస్సైలు అబీద్ బేగ్, మున్వార్ ఖాన్, పోలీసు సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

దోమకొండ, సెప్టెంబరు 20: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్ అన్నారు. శుక్రవారం బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అఖిల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా

● జిల్లా ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్

బీర్కూర్, సెప్టెంబరు 20: పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ గుప్త అన్నారు. శుక్రవారం ఆయన బీర్కూర్ మండల కేంద్రానికి విచ్చేశారు. ఆయనకు సంఘ సభ్యులు శాలువను కప్పి ఘనంగా సన్మానించారు. ఈనెల 23న జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని బీర్కూర్ మండల ఆర్యవైశ్య సభ్యులను ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని, ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీర్కూర్‌లో నూతనంగా నిర్మించిన నగరేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహాసభ ప్రధానకార్యదర్శి ముత్యపు సుదర్శన్, అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి సుధాకర్, బీర్కూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కర్నకంటి ప్రవీణ్ కుమార్, కందుకుర్తి సంతోష్, వీరయ్య, నాగరాజు, కొట్టూరి ప్రవీణ్, సంతోష్, ఉడుత జగదీష్, మాలే నర్సింలు, మహాజన్ సంతోష్, వేముల సంతోష్ పాల్గొన్నారు.



బీర్కూర్‌లో బాలకిషన్‌ను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

విశ్వకర్మ యోజన చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నసురుల్లాబాద్, సెప్టెంబరు 20: మండల కేంద్రంలో ఐవోబీ బ్యాంకు ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన లక్ష రూపాయల చెక్కులను అధ్యక్షులు సున్నం సాయిలు ఆధ్వర్యంలో లబ్ధిదారులు సంకూరి రేఖ, వడ్ల వెంకటి, మంగలి రతనులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు సున్నం సాయిలు, జిల్లా అధికార ప్రతినిధి హన్మాండ్లు, జిల్లా ఓబీసీ సభ్యులు వడ్ల సతీష్, ప్రధాన కార్యదర్శి మేకల రామన్న, కిషన్ మోర్చా అధ్యక్షులు యాదగిరిగౌడ్, అనుసూరి శ్రీని వాస్, బూత్ అధ్యక్షులు కంది మల్లేష్, ఉల్లెంగా గోపి, పెర్క రాములు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల బ్యాలెన్స్ రుసుములో జాప్యం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 20: కామారెడ్డి జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేసిన పనులకు రూ.2లక్షల శాంక్షన్‌కు క్యూసీ, క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ లేకుండా ఏపీసీ పనులు పూర్తిచేసిన పాఠశాలకు బ్యాలెన్స్ అమౌంట్ వెంటనే ఇప్పించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డీఈవో కు వినతిపత్రం అందించారు. ఒకవేళ క్యూసి తప్పనిసరి అయితే విద్యాశాఖ కార్యాలయ సిబ్బందితో పంచాయతీ రాజ్ ఆఫీస్‌లోని క్యూసీ డిపార్ట్‌మెంట్‌లో వెంటనే పనులు పూర్తిచేయించి ప్రధానోపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరామని తెలిపారు.

నేడు గాంధీభవన్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమావేశం

● హాజరవుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నేతలు

నిజామాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమీక్ష సమావేశం జరగనుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు, రాష్ట్ర వ్యవసాయ సలహా దారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్‌అలీతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హుందాన్, మానాల మోహన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, కాసుల బాల్‌రాజ్, అన్వేష్ రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని తాజా పరిస్థితులు, పార్టీని పటిష్టం చేయడం, ప్రభుత్వ పథకాలు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపైన ఈ సమావేశంలో చర్చించనున్నారు. పీసీసీ అధ్యక్షునిగా మహేష్ కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. సమావేశంలో నామినేటెడ్ పదవుల నియామకం, ఇతర అంశాలపైన కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

జిల్లాలో రాబోయే మూడురోజుల్లో ఓ మోస్తారు వర్షాలు

ఖిల్లా, సెప్టెంబరు 20: జిల్లాలో రాబోయే మూడు రోజులలో ఓ మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన వాతావరణ విభాగం టెక్నికల్ అధికారి బి.శ్రీలక్ష్మి తెలిపారు. జిల్లాలోని పలు మండలాల పరిధిలో ఈ వర్షం పడే అవకాశం ఉందన్నారు. రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. మూడురోజుల పాటు ఎటువంటి రసాయనాలను పొలాల్లో వాడద్దని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత స్ప్రే చేసుకోవాలని కోరారు. వర్షాలు పడే సమయంలో పంట చేనుల్లో నీళ్లు నిలువ ఉండకుండా చూడాలన్నారు. నీటిని బయటకు వెళ్లే విధంగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వరికి సుడిదోమ ఆశించే అవకాశాలు ఉన్నందున రైతులు వర్షాలు తగ్గిన తర్వాత వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా 1.5 గ్రాము ఎస్ఫేట్‌ను లీటరు నీటితో కలిపి వరి మొదళ్లపై పిచికారీ చేయాలని తెలిపారు. ఉత్తర అండమాన్ సముద్రం పరిసర ప్రాంతంలో ఏర్పడిన చక్రవాకపు ఆవర్తనం వల్ల గాలులు ఏర్పడి వాయువు దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావం వల్ల బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

'పీడీఎస్‌యూ సభలను జయప్రదం చేయండి'

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 20: పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు భారీర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి ప్రదర్శన పేరుతో నిర్వహించిన ర్యాలీలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నరేందర్, గణేష్‌లు మాట్లాడారు. కామ్రేడ్ జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్, శ్రీపాదశ్రీహరి, కోలాశంకర్, రంగవల్లి, చేరాలు లాంటి ఎంతో మంది విద్యార్థి అమరుల త్యాగాల పునాదులపై పీడీఎస్‌యూ ఉద్యమం నిర్మింతమైందన్నారు. ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో భారీ ర్యాలీ నిర్వహించి ఠాగూర్ ఆడిటోరియంలో స్వర్ణోత్సవ సభ నిర్వహించడం జరుగుతుందని ఈ సభలకు విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రగతిశీల శక్తులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 20: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పీజీటీ ఎకనామిక్స్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ పి.దశరథ్ తెలిపారు. పీజీటీ ఎకనామిక్స్ సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఎడ్, టెట్ పరీక్ష అర్హత కలిగి ఉండాలన్నారు. ఈనెల 23న దరఖాస్తుకు చివరి తేదీ అని అదే రోజు ఇంటర్వ్యూ, డెమో నిర్వహించడం జరుగుతుందన్నారు. మిగతా వివరాల కోసం 9948499296 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న బీఎడ్ సెమీస్టర్ పరీక్షలు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 20:తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో బీఎడ్ రెగ్యూలర్ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు మొత్తం 1278 మందికి గాను 1224 మంది హాజరుకాగా 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

మహాలక్ష్మీ పథకం సబ్సిడీ పత్రాల అందజేత

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 20: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ మహాలక్ష్మీ పథకం సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్‌ను అందజేయడం చాలా సంతోషంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్ మున్న, కమిషనర్ రాజు, కౌన్సిలర్‌లు ఆకుల రాము, బండారి ప్రసాద్, బారడ్ రమేష్, సుంకరి రంగన్న, కొంతం మురళీ, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ క్రీడలు ప్రారంభం

● క్రీడలను ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: అటవీశాఖ బాసర జోనల్ క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను నాగారంలోని రాజారాం స్టేడియంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ క్రీడలను ప్రారంభించారు. మొదటగా నాలుగు జిల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి ఎమ్మెల్యేకు గౌరవ వందనం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి పతాకావిష్కరణ నిర్వహించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నిత్యం పర్యావరణ పరిరక్షణ కోసం అడవులను కాపాడుతున్నారని అటవీ శాఖ ఉద్యోగులను అభినందించారు. విధినిర్వహణలో ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న వారికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ధృఢత్వాన్ని పొందవచ్చన్నారు. నిజామాబాద్ జిల్లా అంటేనే క్రీడలకు పెట్టింది పేరని, జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఎందరో క్రీడాకారులున్నారని గుర్తుచేశారు. జిల్లాలో స్పోర్ట్స్‌ట్రాక్స్ నిర్మాణం, ఇండోర్ స్టేడియంల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని తెలిపారు. ఈ అంశాలపై ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తన ఐదేళ్ల ఎమ్మెల్యే హయాంలో పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఇండోర్ స్పోర్ట్స్ నిర్మాణం, రాజారాం గ్రౌండ్‌కు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిచిన వారు ఉన్నత శిఖరాలకు వెళ్లేలా ప్రయత్నించాలని, ఓడిన వారు కృంగిపోకుండా గెలుపు దిశగా ప్రయత్నం చేయాలని సూచించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీసీఎఫ్ శరవణ్, జిల్లా ఫారెస్ట్ అధికా రులు నిఖిత, ప్రశాంత్ బాజీరావు, రవిప్రసాద్, నాగిని భాను, రవీందర్, డివిజనల్ అధికారులు సుధాకర్, భవాని శంకర్, ఎఫ్ఆర్‌వోలు సంజయ్ గౌడ్, రవిమోహన్‌భట్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎస్‌బీపీ యంత్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

పెద్దబజార్, సెప్టెంబరు 20: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెస్ యంత్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ శుక్రవారం ప్రారంభించారు. రోగుల అవసరాలనుబట్టి ఒకే దాత నుంచి ప్లేట్‌లెస్‌లను సేకరించడం ఈ మిషన్ ద్వారా సాధ్యమవుతుందని ఆమె తెలిపారు. ఈ మిషన్ ఖరీదు రూ.40లక్షల వరకు ఉంటుం దని ఆమె తెలిపారు. ప్లేట్‌లెస్‌ను ఎవరైనా దానం చేయవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇమ్రాన్ అలీ, చందు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

వ్యక్తిని హత్య చేసిన ఇద్దరికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 20: షేక్ మాజీద్ అనే వ్యక్తిని హత్య చేసిన షేక్ జుబేర్, షేక్ అతీక్‌లకు జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... నాగారానికి చెందిన షేక్ మజీద్, ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ జుబేర్‌లు స్నేహితులు. ఆటో నడుపుతూ ఉండేవారు. జుబేర్ భార్య పట్ల పలుమార్లు మాజీద్ అసభ్యకరంగా దుర్భాషలాడాడు. విసుగు చెందిన షేక్ జుబేర్ పథకం ప్రకారం 29-12-2021న రాత్రి 8గంటలకు కల్లు సేవించేందుకు మజీద్‌కు ఫోన్ చేసి రమ్మని చెప్పాడు. జుబేర్ చిన్నానాన్న అయిన షేక్ అతీక్‌కు విషయం చెప్పి వెంట కత్తిని తీసుకొని మాధవనగర్ శివారులో కల్లుతాగించారు. మద్యం మత్తులో ఉన్న మాజీద్‌ను బర్ధిపూర్ గ్రామ శివారులో వెంటతెచ్చుకున్న కత్తితో చాతిలో, మెడలో పొడిచి గాయపర్చి, చనిపోయాడని నిర్ధారించుకొని పక్కనే ఉన్న వ్యవసాయ కాలువలో పారేసి అక్కడి నుంచి పారిపోయారు. డిచ్‌పల్లి పోలీసులు విచారణ చేపట్టి కోర్టులో హాజరుపర్చగా నిందితులపై నేరం రుజువు కావడంతో ఇద్దరికి సెషన్స్ జడ్జి జీవితఖైదు విధిస్తూ అదనంగా రూ.2 వేల రూపాయల జరిమానా కట్టని యెడల మరో ఆరునెలల జైలు శిక్ష విధించాలని తీర్పుచెప్పారు.

బోధన్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గోదాముల స్థల పరిశీలన

బోధన్‌రూరల్,సెప్టెంబరు 20: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, వైస్ చైర్మన్ చీలశంకర్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీలకు సంబంధించిన చెక్‌పోస్టులను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం గోదాముల నిర్మాణం కోసం స్థల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించారు. అనంతరం బోధన్‌లో నిర్మాణం కోసం స్థల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు తదితరులున్నారు.

డిగ్రీ విద్యార్థుల శ్రమదానం

ధర్పల్లి, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛత సేవా-2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, స్వచ్ఛభారత్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని విద్యార్థులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లోని ప్రజలకు తమ పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారంతో పాటు నీటినిల్వలు ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కుమారస్వామి, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్, గంగాధర్, దేవిదాస్ పాల్గొన్నారు.

'సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తా'

ఖిల్లా, సెప్టెంబరు 20 : ఉమ్మడి జిల్లాలోని అన్ని సొసైటీల అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తానని ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్‌తార చంద్‌నాయక్ అన్నారు. ఉమ్మడి జిల్లాల పీఏసీఎస్ సిబ్బంది శుక్రవారం ఐడీసీఎంఎస్ చైర్మన్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శులు తమ సమస్యలను చైర్మన్‌కు వివరించారు. సొసైటీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమవంతు కృషి చేస్తాననన్నారు. ప్రతి సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సొసైటీల అభివృద్ధికి తమకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ మేనేజర్ నాగేష్, ఏబీఎం.బీ.చిన్నయ్య, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సొసైటీ సీఈవోలు నర్సయ్య, కిషన్, వంశీ, సాయిచందర్, కృష్ణ, నంబుద్రిపాద్, విష్ణువర్ధన్, నాగరాజు, శంకర్, రతన్, ప్రవీణ్, రమేష్, శేఖర్, గంగానర్సయ్య, సాయిలు, ఎండీ.మోహిద్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ అధ్యక్ష పదవికి రాజీనామా ?

● ఇంకా ఆమోదించని రాష్ట్ర నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: టీఎన్‌జీవోస్ అధ్యక్ష పదవికి అలుక కిషన్ రాజీనామా చేసినట్లు తెలిసింది. ఎనిమిదేళ్ల పాటు టీఎన్‌జీవోస్‌లో తనదైన ముద్ర వేసిన అలుక కిషన్ గెజిటెడ్ ఉద్యోగులు టీఎన్‌జీవోస్‌లో ఉండవద్దనే నిబంధన మేరకు రాజీనామా చేసినట్లు తెలిసింది. ఈ మేరకు గత కొన్ని రోజుల క్రితం రాజీనామాను రాష్ట్ర నాయకత్వానికి అందజేశారు. అయినా రాష్ట్ర నాయకత్వం రాజీనామాను ఆమోదించలేదు. ఎన్నికలు నిర్వహించే వరకు అధ్యక్షుడిగా కొనసాగాలని కోరినట్లు సమాచారం.

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పదిరోజుల పాటు గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర పాలక సిబ్బంది తెలిపారు. నగరంలోని 42, 52, 21, 44 డివిజన్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని మానవహారం నిర్వహించారు. చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడం పరిసరాలను శుభ్రపర్చడం చేశారు.

19 ఫీచర్లతో టీజీఎన్‌పీడీసీఎల్ యాప్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20: విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువై సాంకేతిక పరంగా మరిన్ని అంశాలు జోడించి టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను 19 ఫీచర్లతో యాప్‌ను రూపొందించామని టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ అన్నారు. ఈ యాప్‌లో ఎటువంటి సమస్యలైనా జీపీఎస్ లొకేషన్ ద్వారా సంఘటనను ఫొటో తీసి పంపవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదును తెలపవచ్చని సెల్ఫ్ రీడింగ్, పే బిల్స్, బిల్ హిస్టరీ, ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ, లింక్ ఆధార్, కొత్త కనెక్షన్‌లు ఎలా తీసుకోవాలి, తదితర 19 ఫీచర్‌లతో ఈ యాప్‌ను రూపొందించామని తెలిపారు. ఈ యాప్ ద్వారా వినియోగదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

ఖిల్లా, సెప్టెంబరు 20: నగరంలోని మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల సంజీవయ్య కాలనీకి చెందిన అజయ్, అతని తమ్ముడు అర్వింద్‌లపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడోటౌన్ ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు. గణేష్ నిమజ్జనం అనంతరం శోభాయాత్రను తిలకించి ఇంటికి వెళ్తున్న అర్వింద్, అజయ్‌లపై పాత కక్షలను మనుసులో పెట్టుకున్న క్రాంతి, అభిషేక్, నాగార్జున, కార్తిక్‌లు కలిసి స్క్రూడ్రైవర్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. చంపేస్తామని బెదిరించారు. చికిత్స అనంతరం బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కొనసాగుతున్న జెండా ఉత్సవాలు



ఉత్సవ విగ్రహాలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 20 : జెండా జాతర ఉత్సవాలు నగరంలోని పూలాంగ్ వద్ద కొనసాగుతున్నాయి. ఎంతో వైభవోపేతంగా జెండా గల్లీలో గల జెండా బాలాజీ మందిర్‌లో కొనసాగిన ఉత్సవాలు బుధవారం పూలాంగ్ వద్దకు శోభాయాత్రగా ఊరేగించి పూలాంగ్ వద్ద ప్రతిష్టించారు. జెండా బాలాజీ మందిర్‌లో దర్శించుకోలేని భక్తులు పూలాంగ్ వద్ద జరిగే ఉత్సవాల్లో పాలుపంచుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామీణ ప్రజలతో పాటు కాలనీవాసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు, జెండాకు నిర్వహించే పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం వరకు కొనసాగనున్నట్లు ఆలయ వంశపారంపర అర్చకులు అజయ్‌సంగ్వాయ్ తెలిపారు.

జెండా జాతరకు భక్తుల విరాళాలు

దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని జెండా బాలాజీ మందిర్‌కు భక్తులు విరాళాలు అందజేశారు. శుక్రవారం దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ విజయ్‌రామారావుకు వచ్చిన విరాళాలను ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, కార్యనిర్వహణ అధికారి వేణు అందజేశారు. 8లక్షల 50వేల 373 రూపాయలు ఆదాయాన్ని కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఖిల్లా, సెప్టెంబరు 20 : నగరంలోని ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖలీల్‌వాడి ప్రాంతం నుంచి గురువారం రాత్రి బాలిక అదృశ్యమైనట్లు ఆమె కుటుంబసభ్యులు శుక్రవారం ఒకటోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తన సోదరి డెలివరి కోసం ఖలీల్‌వాడిలోని ఓ ఆసుపత్రికి వచ్చి అక్కడి నుంచి కనిపించకుండా పోయిందని ఆ ఫిర్యాదులో తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు. కాగా బాలిక కుటుంబసభ్యులు మాత్రం ఓ యువకుడు కిడ్నాప్ చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

డిచ్‌పల్లి, సెప్టెంబరు 20 : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం (బీ) గ్రామంలో వివాహిత ఉమ (30) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యానవన శాఖ కార్యాలయం మార్పు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20 : నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యానవన శాఖ కార్యాలయాన్ని మార్చినట్లు ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇదివరకు ఉన్న 208 రూమ్‌నెంబర్ నుంచి 203 రూమ్‌కు మార్చినట్లు తెలిపారు. నూతన కార్యాలయాన్ని శుక్రవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం మార్పును రైతులు గమనించాలన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌పోటీలకు

సుద్దపల్లి విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 20:సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు సాత్విక, గంగోత్రి, నెహ్రాశ్రీ, శ్రావిక, లిఖిత, నిశిత, కీర్తనలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నలిని తెలిపారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో ఈనెల 21 నుండి 23 వరకు సిరిసిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పిడి అనుష, పిఈటి శ్రీలత, కోచ్ వేముల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండురోజుల జైలు

ఖిల్లా, సెప్టెంబరు 20 :మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ నేతృత్వంలో నగరంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనంపై వెళ్తుండడాన్ని గుర్తించారన్నారు. ఆయనను కౌన్సెలింగ్ చేసిన అనంతరం శుక్రవారం కోర్టు ఎదుట హాజరు పరిచారన్నారు. మెజిస్ట్రేట్ అహ్మద్ మోహియుద్దీన్ ఆ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారన్నారు.

డయల్ 100 దుర్వినియోగం చేసిన వ్యక్తికి...

ఇందల్వాయి, సెప్టెంబరు 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం అందిస్తున్న డయల్ 100 సేవలను దుర్వినియోగం పర్చినందుకు ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ బాబా అనే వ్యక్తిపై కేసు నమోదు అయింది. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కోర్టు నందు హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డయల్ 100 సేవలను దుర్వినియోగం పర్చిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఎవరైనా అత్యవసర సమయంలోనే డయల్ 100ను వాడుకోవాలని మద్యం మత్తులో ఇతర కారణాల చేత దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తుంది'

ఇందల్వాయి, సెప్టెంబరు 20 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని కాంగ్రెస్ పార్టీ ఇందల్వాయి శాఖ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందల్వాయి గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహాలక్ష్మి పథకం ఎల్‌పీజీ సబ్సిడీ పత్రాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందించినట్లు తెలిపారు. వీటితో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన ఉచిత విద్యుత్, రైతులకు రెండులక్షలలోపు రుణమాఫీ కాంగ్రెస్ ఇప్పటికే అమలు చేసిందన్నారు. త్వరలో అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు, రైతులకు రైతుభరోసాతో పాటు పూర్తిగా ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాచర్ మల్లయ్య, గట్టు కడారి, తోటరాజన్న తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75300	రూ.69500	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పైలం పిలగా (1.15)
: మత్తు వదలరా-2 (4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (3డి ఇంగ్లీష్) (11.00, 4.35)
: యుద్ర (హిందీ) (1.30)
: హర్దాస్ సర్బత్ ది బాలేబి (పంజాబి) (7.05)
: గొర్రె పురాణం (10.10)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.50)
: సరిపోదా శనివారం (3.50, 10.30)
: యుద్ర (హిందీ) (7.25)
స్క్రీన్-4 : చీక్‌లెట్స్ (తెలుగు) (10.20)
: తుంబ్బడ్ (హిందీ) (1.00)
: మనం (3.40) : మాయాబజార్ (7.05)
: స్త్రీ-2 హిందీ (11.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (4.30)
: మత్తు వదలరా-2 (7.20, 10.25)
స్క్రీన్-2 : సరిపోదా శనివారం (1.30, 7.25)
స్క్రీన్-3 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (ఇంగ్లీష్ 3డి) (11.00, 4.40, 10.35)

దేవి : మత్తు వదలరా-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: యుద్ర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: బొమ్మరిల్లు (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్